క్లుప్తంగా

జగ్గయ్యపేటలో 2,05,364 మంది ఓటర్లు

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గంలో 2,05,364 మంది ఓటర్లు ఉన్నారని ఆర్వో జి.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. మొత్తం ఓటర్లలో పురుష ఓటర్లు 98,463మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,06,888మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 13మంది ఉన్నట్లు తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంలో 43,675మంది ఓటర్లు, జగ్గయ్యపేట మండలంలో 54,436మంది, పెనుగంచిప్రోలు మండలంలో 41,815మంది, వత్సవాయి మండలం 50,017మంది, నందిగామ మండల ఏటిపట్టు గ్రామాల్లో 15,421మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. ఇటీవల 18ఏళ్లు నిండి నూతనంగా ఓటుహక్కు పొందిన ఓటర్లు 5861మంది ఉన్నారని ఆర్వో వివరించారు.

నందిగామలో 2,05,442మంది ఓటర్లు

నందిగామ:నందిగామ నియోజకవర్గంలో మొత్తం 2,05,442 మంది ఓటర్లు ఉన్నారని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు శుక్రవారం తెలిపారు. మొత్తం ఓటర్లలో పురుష ఓటర్లు 99,382మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,06,054మంది, థర్డ్ జెండర్ ఓటర్లు ఆరుగురు ఉన్నట్లు వివరించారు. సర్వీస్ ఓటర్లు 41మంది ఉన్నారని ఆర్వో తెలిపారు.

ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

గండేపల్లి(కంచికచర్ల) : పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలకు చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని సర్పంచి బొక్కా రవికుమార్(ఏసోబు) అన్నారు. గండేపల్లిలోని మురుగుకాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఎబేట్‌ను పిచికారీ చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి బెల్లంకొండ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



పెనుగంచిప్రోలు: బాల్య వివాహాలు అరికట్టాలని బాలల సంరక్షణ జిల్లా అధికారి ఎం.రాజేశ్వరరావు అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీజన్‌లో వివాహాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున, అందులో బాల్యవివాహాలు లేకుండా చూడాలన్నారు. . గ్రామాల్లో వివిధ శాఖల అధికారులతో అవగాహన సదస్సులు నిర్వహించి, బాల్యవివాహాల కారణంగా వచ్చే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడుతూ మీ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే సమాచారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.

ముగిసిన పుష్కర బ్రహ్మోత్సవాలు



వెంకటాపురం(పెనుగంచిప్రోలు): గ్రామంలో వేంచేసియున్న శ్రీఆంజనేయ సమేత కోదండ రామస్వామి వారి ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. చిన్నజీయర్‌స్వామి శిష్యులు హైదరాబాద్‌కు చెందిన గోవర్ధన రాఘవాచారి ఆధ్వర్యంలో పూజలు, హోమాలు చేశారు. ఏడోరోజు శుక్రవారం 108 కలశాల జలాల అభిషేకాలతో ముగిశాయి. అనంతరం సర్పంచ్ కూచి నర్సయ్య, ఎంపీపీ మార్కపూడి గాంధీ, కార్యక్రమ నిర్వాహకులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఉత్సవాలను ముగించారు.

29నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని గ్రంథాలయంలో ఈనెల 29వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ శుక్రవారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించి ఈ శిబిరంలో కథలు చదివించడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్‌తోపాటు స్పోకెన్ ఇంగ్లిష్, తెలుగులో చక్కని దస్తూరి, సైన్స్, గణిత తదితర సబ్జెక్టుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. పదోతరగతిలోపు చదివే ప్రతివిద్యార్థి ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగ్గయ్యపేటలో 14మంది నామినేషన్లు ఆమోదం



నామినేషన్లను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటేశ్వర్లు, పక్కన ఏఆర్వో శేషగిరి తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమం చేపట్టారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 23మంది అభ్యర్థులు 39నామినేషన్లు దాఖలు చేయగా, 14మందికి చెందిన నామినేషన్లు నిబంధనలకు అనుగుణంగా ఉండటంతో ఆమోదించినట్లు ఆర్వో జి.వెంకటేశ్వర్లు తెలిపారు. వివిధ కారణాలతో తొమ్మిది మందికి చెందిన నామినేషన్లను తిరస్కరించినట్లు ఆర్వో వివరించారు.

ఆమోదించిన నామినేషన్ల వివరాలు..

సామినేని ఉదయభాను (వైఎస్సార్ సీపీ), శ్రీరాం రాజగోపాల్(టీడీపీ), కర్నాటి అప్పారావు(కాంగ్రెస్), కొదమల ప్రభుదాసు (బీఎస్పీ), గుడిసె రాంబాబు (తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ) నామినేషన్లను అధికారులు ఆమోదించారు. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థులు వేల్పుల విజయ్, జామా ఆనందరావు, అయిలపోగు వెంకటేశ్వర్లు, కందుల నరసింహారావు, చేకూరి గోపీనాథ్, జిల్లేపల్లి సుధీర్‌బాబు, బోరోతుల ప్రకాశరావు, మేడేపల్లి ఫ్రాన్సిస్, జొన్నకూటి అహరోను నామినేషన్లను కూడా ఎన్నికల అధికారులు ఆమోదించారు. అదేవిధంగా ఆయాపార్టీల ప్రధాన అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం లభించినందున శ్రీరాం శ్రీదేవి (టీడీపీ), సామినేని విమల(వైఎస్సార్‌సీపీ) నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. తిరస్కరణకు గురైన వాటిల్లో చింతమాల నవీన్ అంబేడ్కర్(నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), కరిసె మధు(జైభీంరావు పార్టీ), శ్రీరాం రామకృష్ణ, అన్నెపాక రత్నం(జాతీయ జనసేన పార్టీ), స్వతంత్ర అభ్యర్థులు కట్టా బుజ్జిబాబు, దాసరి రవికుమార్, ఎస్.దుర్గాభవాని నామినేషన్లు ఉన్నాయి.

వైభవంగా వసంతోత్సవం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి వసంతోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. భక్తులు, గ్రామస్తులు గులాబీలు చల్లుకుంటూ వసంతోత్సవం జరుపుకున్నారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ సమీపంలోని చెక్కబావి వద్ద ప్రత్యేక పూజలు చేసి చక్రతీర్థం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ ఈవో నూతక్కి సాంబశివరావు, అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పెద్దసంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో ఆరు నామినేషన్లు తిరస్కరణ



నందిగామలో నామినేషన్లను పరిశీలిస్తున్న ఆర్వో ఎ.రవీంద్రరావు, అధికారులు

నందిగామ: నందిగామ ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ రవీంద్రరావు ఆధ్వర్యంలో శుక్రవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమం జరిగింది. నందిగామ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 17మంది అభ్యర్థులు 24 నామినేషన్లను దాఖలు చేయగా, అందులో 11 మంది నామినేషన్లు ఆమోదించినట్లు ఆర్వో ఎ. రవీంద్రరావు తెలిపారు. వివిధ కారణాలతో ఆరుగురి నామినేషన్లను తిరస్కరించినట్లు ఆర్వో వివరించారు.

ఆమోదించిన నామినేషన్ల వివరాలు..

డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు(వైఎస్సార్ సీపీ), తంగిరాల సౌమ్య(టీడీపీ), బర్రె ఉదయ్ కిరణ్(బీఎస్పీ), మందా వజ్రయ్య(కాంగ్రెస్), కటారపు శాంతారావు(సమాజ్‌వాదీ), పణితీలాల్(జైమహాభారత్‌పార్టీ), బర్రె శ్రీనివాసరావు (తెలుగు రాజ్యాధికారసమితి పార్టీ),బెజవాడ గోపి(జైభీమ్‌రావ్‌భారత్‌పార్టీ), చింతమాలశాస్త్రి (నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ) నామినేషన్లను అధికారులు ఆమోదించారు. స్వతంత్ర అభ్యర్థులు నిప్పులపల్లి కోటేశ్వరరావు, కొత్తపల్లి సుందరరావు నామినేషన్లను కూడా ఆమోదించారు. వివిధ కారణాలతో కట్టా శ్రీరాములు(స్వతంత్ర అభ్యర్థి), తంగిరాల సౌమ్య(స్వతంత్ర అభ్యర్థి), తంగిరాల శ్రావణ్‌కుమార్(టీడీపీ), కొంక విఘ్నేశ్వరరావు(బీఎస్పీ) పెద్దాడ రమాదేవి(వైఎస్సార్ సీపీ), బొక్కా శ్రీనివాసరావు(జనవాహిని పార్టీ) నామినేషన్లను తిరస్కరించినట్లు ఆర్వో రవీంద్రరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే పేదలకు మేలు



పెద్దాపురంలో డాక్టర్ జగన్‌మోహనరావుకు దిష్టి తీస్తున్న మహిళలు



కంచికచర్ల ఇందిరాకాలనీలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రప్రజలకు ఎంతో మేలు చేకూరిందని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం, అల్లూరు, గూడెంమాధవరం, జయంతి, తిమ్మాపురం గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధికి తాను చేసిన కృషిని వివరించి, తన గెలుపునకు సహకరించాలని ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన డాక్టర్ జగన్‌మోహనరావుకు ఆయా గ్రామాల ప్రజలు బ్రహ్మరథంపట్టారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలకు సదా కృతజ్ఞుడినని తెలిపారు. గత ప్రభుత్వాల పాలనకు ప్రస్తుత సీఎం జగనన్న పాలనకు తేడాను గమనించి రానున్న ఎన్నికలలో తనను గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ కోటేరు మల్లేశ్వరి, మాజీ సర్పంచి కోటేరు సూర్యనారాయణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచులు బండెల రాణి, నిప్పులపల్లి శాంతమ్మ, మారపాక మహాలక్ష్మి, బండి సునీత, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యులు మోండ్రు బాయమ్మ, ఇప్పల సత్యనారాయణరెడ్డి, బండి సీతామహాలక్ష్మి, నాయకులు ఇప్పల కృష్ణారెడ్డి, ఆవుల ప్రసాద్, జంగా కోటిరెడ్డి, వేమిరెడ్డి మోహన్‌రెడ్డి, బవిరిశెట్టి లక్ష్మి, అనురాధ, మారపాక శ్రీనివాసరావు, సాంబిరెడ్డి, అనుమోలు వాసు, కుంపటి శ్రీను, బవిరిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : భవిష్యత్ తరాల మేలు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నందిగామ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కంచికచర్ల ఇందిరాకాలనీ, ప్రణీత జంగాలకాలనీల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన జగన్‌మోహనరావుకు మహిళలు దిష్టితీయడంతోపాటు హారతులుపట్టి ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ పేదల అభివృద్ధి గిట్టని ప్రతిపక్ష పెత్తందారీ పార్టీలన్నీ ఒక్కటయ్యాయన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో ఆపార్టీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదుగుల శంకర్, ఎంపీటీసీ సభ్యులు గుగులోతు ఇందిర, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, నాయకులు బోడపాటి బాబూరావు, వేల్పుల శ్రీనివాసరావు, దాసరి రాము, నంబూరు నరసింహారావు, దేవరకొండ గురవయ్య, ఉప్పు స్వామి, తంగిరాల సృజనీకుమార్, గుగులోతు శివకుమార్, కావాటి రాంబాబు, ఒంటిపులి ప్రసాద్, గోగినేని వెంకటేశ్వరరావు, నారిశెట్టి శ్రీనివాసరావు, ఓర్సు నరసింహారావు, శేషం మధుబాబు, అమర్లపూడి యోహాన్, చలమల ప్రభాకర్, అంగడాల పూర్ణచంద్రరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, ముత్యాల రోజారమణి పాల్గొన్నారు.



అల్లూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న డాక్టర్ జగన్‌మోహనరావు

ఉదయభాను గెలుపు కోరుతూ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ దేవమణి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నాయకులు



వెంకటాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ గాంధీ, నర్సయ్య, నాయకులు

వత్సవాయి : వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) విజయాన్ని కాంక్షిస్తూ జెడ్పీటీసీ సభ్యురాలు యేశపోగు దేవమణిశ్రీనివాస్, ఎంపీపీ కొలుసు రమాదేవి, సర్పంచి భూక్యా సీతమ్మల ఆధ్వర్యంలో వత్సవాయిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అందరికీ పథకాలను అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. ప్రచారంలో వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, జిల్లా పార్టీ కార్యదర్శి గాదెల రామారావు, మండల పార్టీ నాయకులు రమాకాంత్, భూక్యా రాజానాయక్ పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

వెంకటాపురం(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అజెండా అని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను విజయాన్ని కోరుతూ వెంకటాపురంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చని వ్యక్తి చంద్రబాబు అయితే, ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగనన్న అని గుర్తుచేశారు. ప్రచారంలో సర్పంచి కూచి నర్సయ్య, ఎత్తిపోతల పథకం సంఘ చైర్మన్ పొన్నం వెంకటేశ్వరరావు, ఎస్సీసెల్ మండల నాయకులు జక్కులూరి దేవదాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు కూచి శ్రీనివాసరావు, మాదల ఉగ్రనరసింహారావు, ముక్కంటయ్య పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్సీ అరుణకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పోలింగ్ కేంద్రాల స్థాయి పార్టీ కన్వీనర్‌లు, కమిటీ సభ్యులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ సూచించారు. పట్టణంలోని ఆర్ఎస్ గార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి 'జగన్ కోసం మేం సిద్ధం' కార్యక్రమంపై పోలింగ్ కేంద్రాల స్థాయి పార్టీ కన్వీనర్లకు శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, కేశినేని శ్రీనివాస్ (నాని) విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సీఎం జగనన్న ఐదేళ్లలో ప్రజలకు చేసిన మేలును ఇంటింటికీ వెళ్లి వివరించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర ప్రజలకు మంచి జరుగుతుందని పేర్కొన్నారు. నాయకులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, అంగడాల పూర్ణచంద్రరావు, ఓర్సు జ్వాలా, మంచాల చంద్రశేఖర్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, కొమ్ము విజయరాజు, గోనెల సీతారామయ్య, యాకుబ్ అలీ, పోలింగ్ కేంద్రాల స్థాయి కన్వీనర్లు పాల్గొన్నారు.

నామినేషన్‌కు వెళ్లారని కుళాయి పైప్‌లైన్ కట్

దుశ్చర్యలకు పాల్పడిన టీడీపీ నాయకులు



గొట్టుముక్కలలో పైపులైన్ కట్‌చేసి వేసిన దమ్మి

గొట్టుముక్కల(కంచికచర్ల): నందిగామ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు నామినేషన్ కార్యక్రమానికి హాజరైనందుకు ఓ కుటుంబానికి చెందిన మంచినీటి కొళాయి పైపులైన్ కట్‌చేసిన ఘటన కంచికచర్ల మండలంలోని గొట్టుముక్కలలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని ధనలక్ష్మినగర్‌లో నివాసం ఉంటున్న వరికూటి ఏసోబు కుటుంబసభ్యులు ఈనెల 24న నందిగామలో జరిగిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ జగన్‌మోహనరావు నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ విషయాన్ని సహించలేని గ్రామానికి చెందిన కొందరు నాయకులు సర్పంచి తుల్లిమిల్లి రాజ్‌కుమార్‌చే తన ఇంటికి చెందిన మంచినీటి కొళాయి పైపులైన్‌ను కట్‌చేయించారని బాధితుడు ఏసోబు తెలిపారు. పైపులైన్ తొలగింపుపై పంచాయతీ సిబ్బందిని అడిగితే, నీకేంటి సమాధానం చెప్పేదంటూ తనపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు ఏసోబు వివరించారు. తన ఇంటికి కొళాయి పైపులైన్ తొలగించిన వైనంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

రేపు పద్మశాలీల ఆత్మీయ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 28వ తేదీన జగ్గయ్యపేట నియోజకవర్గ పద్మశాలీల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జేఆర్సీ కళాశాల రోడ్‌లో ఎస్ఎల్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే ఈ ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్(నాని), రాష్ట్ర ఆప్కో చైర్మన్, పార్టీ చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, పద్మశాలీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మితోపాటు పలువురు ప్రముఖులు అతిథులుగా పాల్గొంటారని వివరించారు. ఆత్మీయ సమావేశానికి నియోజకవర్గంలోని పద్మశాలీలంతా హాజరుకావాలని ఆయన కోరారు.

గోవుల సంరక్షణకు రూ.10,116 విరాళం

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు శుక్రవారం గుంటూరుకు చెందిన చెన్ను శ్రీనివాస్‌కుమార్ కుమారుడు సూర్యరత్నగౌడ్ రూ.10,116లను విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా విరాళాన్ని అందజేశారు.ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి

వీరులపాడు: వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ కోటేరు లక్ష్మి తెలిపారు. మండలంలోని జుజ్జూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వేసవిలో తాగు, వాడుక నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పనిచేయని బోరు పంపులకు తక్షణమే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. వైస్ ఎంపీపీలు షేక్ నాగుల్ మీరా, వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యులు ఇప్పల సత్యనారాయణరెడ్డి, యాదాల సుజాత, శీలం రమణారెడ్డి, తోట నారాయణరావు, మోండ్రు బాయమ్మ, వేమిరెడ్డి కోటేశ్వరీ, తమ్మిశెట్టి వరలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు షేక్ జయాలుద్దీన్, వైద్యాధికారులు దీపిక, నందిన, కర్ల రాణి పాల్గొన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన ఎన్నికల పరిశీలకులు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పరిశీలకులు

పెనుగంచిప్రోలు:స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సార్వత్రిక ఎన్నికల విజయవాడ పార్లమెంట్ వ్యయ పరిశీలకులు వి.జస్టిన్ సందర్శించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో సిబ్బంది, మందులు, ఇతర వివరాలను వైద్యాధికారి పి ఇందిరను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంచుకోవాలి



వేణును సత్కరిస్తున్న కాలేజీ యాజమాన్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం ఇండస్ట్రీయల్ ప్రామోషన్ ఆఫీసర్ వేణు కేసం అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈడీసీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఐపీఆర్ డేను పురస్కరించుకొని మేధో సంపత్తి హక్కులపై అవగాహన సదస్సును ఆ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు కేసం మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కుల ద్వారా దేశానికి అద్భుతమైన ఆదాయం లభిస్తుందన్నారు. మేధో సంపత్తి హక్కులపై సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది మంచి ఆదాయాన్ని కోల్పోతున్నారన్నారు. వీటిపై విద్యార్థులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవడం ద్వారా విస్తృతమైన ఉపాధి అవకాశాలను పొందవచ్చని వివరించారు. అనంతరం వేణును కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఏ రమాదేవి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.విజయ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఐదు పరీక్ష కేంద్రాలు

నందిగామ: పాలిసెట్–2024 ప్రవేశ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. పాలిసెట్ రాసే అభ్యర్థుల కోసం నందిగామ పట్టణంలో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 1,503 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, డీవీఆర్ జూనియర్ కాలేజ్, ఎంఆర్ఆర్ కళాశాల, శ్రీవిద్య పాఠశాల, నారాయణ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో శనివారం ఉదయం 11గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 10గంటలకల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. ఒక నిమిషం ఆలస్యమైన పరీక్షకు అనుమతించమని తెలిపారు. పరీక్షకు హాజరయ్యేవారు తప్పనిసరిగా పెన్సిల్, పెన్, ప్యాడ్ వంటివి మాత్రమే వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

నందిగామ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం పదిన్నర గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం విశ్వనాథ్ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ ఆకుల హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయాశాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.